క్లుప్తంగా

వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే కైలే



పమిడిముక్కల: కనుమ పర్వదిన సందర్భంగా మంటాడ శ్రీ అలివేలు మంగా పద్మావతి సమేత వైకుంఠ వెంకటేశ్వరస్వామిని బుధవారం మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని స్వామి వారిని కోరుకున్నట్లు అనిల్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు మేరుగ లక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు యేనుగ మస్తాన్‌రావు, కోడె బోయిన కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా గంగానమ్మ జాతర



జమీదగ్గుమిల్లి(పామర్రు): మండలంలోని జమీ దగ్గుమిల్లిలో బుధవారం గంగానమ్మ తల్లి జాతర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ గ్రామంలోని గంగానమ్మ తల్లికి 108 బిందెలతో జలాభిషేకం నిర్వహించామన్నారు. పసుపు, కుంకుమలతో విశేషంగా పూజలు నిర్వహించి, అమ్మవారికి నూతన వస్త్రాలను అందజేశామన్నారు. చిన్న, పెద్ద అనే తేడా లేకండా ప్రతిఒక్కరూ ఈ జాతరలో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో పోతార్లంక రఘుపతి, నాగమల్లేశ్వరరావు, కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, లక్ష్మణస్వామి తదితరులు పాల్గొన్నారు.

పనిచేయని ఏటీఎంలు

గుడ్లవల్లేరు: మండలంలోని పలుచోట్ల పండుగ పూట ఏటీఎంలలో సొమ్ము రాకపోవటంతో వినియోగదారులు ఇబ్బందులకు గురయ్యారు. పండగ సెలవులు కావటంతో కొన్ని గ్రామాల్లో ఏటీఎంలలో నగదు విడుదల కాకపోవటంతో వినియోగదారులు వివిధ అవసరాలకు నగదు కోసం కష్టాలు పడ్డారు.

ఐద్వా ఆధ్వర్యంలో ఆటల పోటీలు

గుడివాడ టౌన్: ఐద్వా సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా బుధవారం స్థానిక రైల్‌పేట, ద్రోణాదుల వారి వీధి తదితర ప్రాంతాల్లో చిన్నారులకు, మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. మహిళలకు మ్యూజికల్ చైర్స్, ముగ్గుల పోటీలు, లెమన్ అండ్ స్పూన్, చిన్నారులకు పరుగు పందేలు నిర్వహించారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐద్వా కార్యదర్శి పి.రజిని, ఆర్.కొండ, ఎస్.సమీర్, వెంకటేష్ పాల్గొన్నారు.

18న త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు

గుడివాడ టౌన్: శ్రీ త్యాగబ్రహ్మ వైభవ ప్రకాశ సభ గుడివాడ ఆధ్వర్యంలో ఈ నెల 18న శ్రీ త్యాగరాజ స్వామి ఆరాధనా మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ప్రకాశసభ అధ్యక్ష కార్యదర్శులు ఉపద్రష్ట రామస్వామి శాస్త్రి, పోపూరి శ్యామ్ సుందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు శ్రీ త్యాగరాజ గాన రాగ పంచరత్న కృతుల గోష్ఠిగానం సాయంత్రం ఏడు గంటలకు త్యాగరాజ స్వామి పల్లకి సేవ తదితర కార్యక్రమాలు ఉంటాయని పేర్కన్నారు.

ఘనంగా కవిరాజు జయంతి



గుడ్లవల్లేరు: త్రిపురనేని రామస్వామి చౌదరి(కవిరాజు) స్వగ్రామం అంగలూరులో ఆయన జయంతి వేడుకలను బుధవారం ఆ గ్రామ ఉప సర్పంచ్ త్రిపురనేని సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కవిరాజు విగ్రహానికి గ్రామ సర్పంచ్ మేడేపల్లి రవికుమార్ పూల మాల వేసి నివాళులర్పించారు.

పంచాయతీ భవనం ప్రారంభం

గుడ్లవల్లేరు: డోకిపర్రు గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని ఆ గ్రామ మాజీ సర్పంచ్, మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి చేతుల మీదుగా బుధవారం ప్రారంభించారు. పామిరెడ్డి, భద్రమ్మ స్మారకార్థం ఈ భవనాన్ని కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ (సీఎస్ఆర్) కింద మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(మెయిల్) ఆర్థికసాయంతో నిర్మించారు. సర్పంచ్ జ్యోతి పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వరాలయ నూతన సంవత్సర క్యాలెండర్లతో పాటు డైరీలను దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతులు స్వామి సన్నిధిలో బుధవారం ఆవిష్కరించారు. మెయిల్ సీఈఓ పురిటిపాటి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సొంత ఊరి కోసం కొంత..

దోకిపర్రులో మంచినీరు, గ్యాస్, రోడ్ల సదుపాయాల ఏర్పాటుకు మెయిల్ కృషి

గుడ్లవల్లేరు: మండలంలోని డోకిపర్రు గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(మెయిల్) వారు ముందుకొచ్చారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ (సీఎస్ఆర్) కింద ఈ సంస్థ తమ స్వగ్రామం డోకిపర్రును దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తూ వస్తోంది. మెయిల్ అధినేత పురిటిపాటి కృష్ణారెడ్డి కుటుంబీకుల చేతుల మీదుగా గ్రామంలో రోడ్లు వేయటం, మంచినీటిని అందించి గ్రామాన్ని అభివృద్ధి చేశారు. అంతేగాక కరోనా సమయంలో కూడా ఆనాటి సీఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డికి కృష్ణారెడ్డి తనవంతుగా బాధితులకు ఆర్థిక సాయం అప్పట్లో ప్రభుత్వానికి అందించారు. కొత్తగా గ్రామంలో తమ సొంత నిధులతో గ్రామ పంచాయతీ భవనాన్ని కూడా నిర్మించారు.

సొంత లాభం కొంత మానుకుని పొరుగు వాడికి సాయపడవోయ్ అనే సూక్తి ఆనాటి కవి కలం నుంచి జాలువారితే.. ఊరు మనకి చాలా ఇచ్చింది.. ఆ ఊరికి మనం కొంత ఇవ్వకపోతే లావు అయిపోతాం అనేది ఈ తరం రచయిత మాట. దీనికి అనుగుణంగా సొంత ఊరి కోసం పాటు పడే ఉపకారులు గుడ్లవల్లేరు మండలం డోకిపర్రులో ఉండటం విశేషం.



ఆనాటి సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి కరోనా బాధితుల కోసం చెక్‌ను అందిస్తున్న కృష్ణారెడ్డి (ఫైల్)



వెంకటేశ్వరుని సన్నిధిలో పూజలు చేస్తున్న చిరంజీవి, సురేఖ, కృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతులు (ఫైల్)

'మెయిల్' అభివృద్ధి పనులు ఇవే..

- ఇంటింటికీ సురక్షిత మంచినీటి ట్యాప్‌లను ఏర్పాటు చేసి గ్రామంలో ఆరు వేల మందికి రూ.4 కోట్ల సొంత నిధులతో మంచినీటి పథకాన్ని నిర్వహిస్తున్నారు.
- గ్రామంలోని 1,500 గృహాలకు గ్యాస్ ఇచ్చేందుకు 20 కిలోమీటర్ల మేరకు పైపులైన్ల నిర్మాణం చేపట్టారు. ఒక్క వంట గ్యాస్ బండకు అయ్యే ఖర్చులో 40 శాతం ఖర్చు వినియోగదారునికి ఆదా అయ్యే విధంగా గ్యాస్‌ను పంపిణీ చేస్తున్నారు. ఈ విధానం ఉమ్మడి కృష్ణాజిల్లాకు కూడా అమలు చేశారు.
- గ్రామంలో ప్రసిద్ధ పుణ్య క్షేత్రం దశావతారాలతో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం చేయటంతో వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు వై.వి.సుబ్బారెడ్డి, విజయసాయి రెడ్డి, సినీ హీరో చిరంజీవి, సీఎం చంద్రబాబు, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మాజీ మంత్రి కొడాలి నాని ఇక్కడకు విచ్చేసి స్వామిని దర్శించుకున్నారు.

వంట గ్యాస్ ఖర్చులో 40 శాతం ఆదా



నిత్యావసరమైన వంట గ్యాస్ ఖర్చులో 40 శాతం ఆదా చేసే విధంగా ఈ ప్రాజెక్ట్‌ను మెయిల్ సంస్థ వారు వారి గ్రామంతో పాటు అంతటా ప్రణాళికా బద్ధంగా రూపొందించారు. గ్యాస్ బండలకు పరుగులు తీసే పరిస్థితికి చెక్ చెప్పారు.

– పి.లక్ష్మీరామ తులసి, గృహిణి, గుడ్లవల్లేరు

గ్రామాభివృద్ధికి ఒకేతాటిపై గ్రామస్తులు



గ్రామాభివృద్ధికి గ్రామస్తులందర్నీ మెయిల్ సంస్థ వారు ఒకేతాటిపై నడిపిస్తున్నారు. మహిళల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకునే ఇంటింటికీ గ్యాస్, కుళాయిలను అందించారు. గ్రామంలో మంచినీరు, రోడ్లు వంటి వసతులు వచ్చాయంటే ఆ సంస్థ పుణ్యమే.

– మహ్మద్ బాజీ, డోకిపర్రు గ్రామస్తుడు



గ్రామంలో రూ.కోట్లతో మంచినీటి పథకం ఏర్పాటు

జోరుగా కోడి పందేలు

తోట్లవల్లూరు: సంక్రాంతిని పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో కోడి పందేలు జోరుగా సాగాయి. మండలంలోని గరికపర్రు, తోట్లవల్లూరు, కుమ్మమూరు, వల్లూరుపాలెం గ్రామాల్లో టీడీపీ నాయకులు కోడి పందేల బరులు ఏర్పాటు చేశారు. ఆయా బరుల్లో మూడు రోజులుగా కోడి పందేలు, పేకాట, చిన్న బజార్, పెద్ద బజారును పెద్ద ఎత్తున నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి పందెంరాయుళ్లు, జూదరులు అధికసంఖ్యలో ఆయా బరులకు తరలివచ్చారు. గరికపర్రు, తోట్లవల్లూరు బరులు పందెంరాయుళ్లతో కిక్కిరిశాయి. యువత, చిన్నారులు కోడిపందేలను ఆసక్తిగా తిలకించారు.



పామర్రు శిబిరంలో తలపడుతున్న కోడి పుంజులు

పమిడిముక్కలలో...

పమిడిముక్కల: మండలంలోని మంటాడ, కపిలేశ్వరపురం, హనుమంతపురం గ్రామాల పరిధిలోని బరుల్లో కోడిపందేలు జోరుగా సాగాయి. ఉదయం నుంచి రాత్రి వరకు యథేచ్ఛగా పందేలు కొనసాగాయి. మూడు రోజుల పాటు పందేలు కొనసాగడంతో పందెంరాయుళ్లు పండుగ చేసుకున్నారు. పందేలకు చూసేందుకు అధిక సంఖ్యలో స్థానికులు తరలిరావడంతో బరుల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఓ బరిలో ఐదు పందేలు గెలిచిన విజేతలకు రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌లు బహుమతిగా అందజేశారు.

పామర్రులో..

పామర్రు: మండలంలో కోడి పందేల జోరు బుధవారం కూడా జోరుగా కొనసాగింది. రెండు రోజులుగా జరుగుతున్న కోడి పందేల శిబిరాలు మూడో రోజు కావడంతో మరింత జోరుగా నిర్వహించారు. ఈ పందేలు పామర్రు, అడ్డాడ గ్రామాల్లో నిరాటంగా సాగాయి. రాత్రి వేళ ఫ్లడ్ లైట్ల వెలుగులో సైతం కోడి పందేలను నిర్వహించారు. కోళ్ల పందేలతో పాటుగా నంబర్ల పందేలు, కోత ముక్క తదితర జూదాలు యథేచ్ఛగా సాగాయి.

మండవల్లిలో..

మండవల్లి: మండలంలోని పలు గ్రామాల్లో సంక్రాంతిని పురస్కరించుకుని జూదం, కోడి పందేలు కొనసాగుతున్నాయి. కనుమ సందర్భంగా చింతపాడు, పులపర్రు, ఇంగిలిపాకలంక, లింగాల, పెరికెగూడెంలో కోడి పందేలు బుధవారం జోరుగా సాగారు. ఈ సందర్భంగా రూ.లక్షలు చేతులు మారాయి.

విజేతకు బుల్లెట్ బహుమతి

ముదినేపల్లి రూరల్: కోడిపందేల్లో వరుసగా విజయం సాధించిన వ్యక్తికి బుల్లెట్ వాహనాన్ని నిర్వాహకులు బహుమానంగా అందజేశారు. మండలంలోని పెదపాలపర్రులో నిర్వహించిన కోడిపందేల్లో మర్రివాడ సుధాకర రెడ్డికి చెందిన కోడిపుంజులు వరుసగా నాలుగు పందేల్లో విజయం సాధించాయి. ఈ సందర్భంగా పందెం నిర్వాహకులు బుల్లెట్ వాహనాన్ని సుధాకర్‌రెడ్డికి బుధవారం బహుమతిగా అందజేశారు.

పందేలను తిలకించిన ఎమ్మెల్యే

గుడ్లవల్లేరు: సంక్రాంతిని పురస్కరించుకుని వేమవరంలో నిర్వహించిన కోడి పందేల్లో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, గిడ్డంగుల శాఖ రాష్ట్ర చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజాబాబు సందడి చేశారు. పందెం కోళ్లతో వచ్చే టీడీపీ నాయకులతో సెల్ఫీలు దిగేందుకు మక్కువ చూపారు.



గరికపర్రులో కోళ్లను పందేనికి వదులుతున్న యువకులు



మండవల్లి మండలం చావలిపాడు బరి వద్ద పేకాట

యథేచ్ఛగా కోడి పందేలు, పేకాట

కైకలూరు: సంక్రాంతి సందర్భంగా కోడిపందేలు, పేకాట, గుంటాట కైకలూరు నియోజకవర్గం పరిధిలో మూడు రోజులు యథేచ్ఛగా కొనసాగాయి. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు బరులను పంచుకున్నారు. ఈ సందర్భంగా మద్యం ఏరులై పారింది. కై కలూరు పేకాట శిబిరంలో మద్యం మత్తులో పలువురు ఘర్షణకు దిగారు. కలిదిండి, ముదినేపల్లి మండలాల బరుల్లో మూడు పందేలను ఏకధాటిగా గెలిచిన వారికి బుల్లెట్లను బహుమతిగా అందించారు.

రామస్వామి చౌదరిపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు

- నేడు కవిరాజు వర్ధంతి
- గత వైఎస్సార్ సీపీ పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా జయంతోత్సవాలు

గుడ్లవల్లేరు: సంఘ సంస్కర్త, ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు, పేదల పక్షపాతి కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరిపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. ఈ విషయమై కవిరాజు స్వగ్రామం అంగలూరు గ్రామస్తులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. అంగలూరుతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా త్రిపురనేని జయంతి వేడుకలను అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైభవోపేతంగా నిర్వహించేది. నేటి సమాజంలో కవిరాజు జీవిత చరిత్ర తెలియని వారికి తెలియజేసేందుకు వారి జయంతిని ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహించాలంటూ 2020నుంచి అప్పటి సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జీఓను విడుదల చేసి, అమలు చేశారు. ఇపుడు వచ్చిన కూటమి ప్రభుత్వం మాత్రం కవిరాజు జయంతి ఉత్సవాలను ప్రభుత్వ పరంగా చేసేందుకు అమలుకు నోచుకోలేదని కవిరాజు అభిమానులు ఆరోపిస్తున్నారు. ఆనాటి జగన్ ప్రభుత్వం కేవలం అంగలూరు గ్రామ స్థాయిలోనే కాకుండా రాష్ట్ర స్థాయిలో ఏటా నిర్వహిస్తూ వచ్చింది.

తెలుగు సాహిత్య సామ్రాజ్యానికి రారాజు

తెలుగు సాహిత్య రంగానికి ఆనాడు కవిరాజు రారాజుగా వెలుగొందారు. ఆయన్ను గురజాడ, కాశీనాథుని నాగేశ్వరరావు వంటి మహనీయులు ఆదర్శంగా తీసుకున్నారు. సీనియర్ ఎన్టీఆర్ సైతం ఆయన రచనలతో సినిమాలను రూపొందించారంటే ఏ మాత్రం అతిశయోక్తి కాదు. గుడివాడ, మచిలీపట్నం, ముంబయి, ఇంగ్లాండ్‌లో రామస్వామి విద్యాభ్యాసం చేసి మచిలీపట్నంలో న్యాయవాదిగా పని చేశారు. సాహిత్యంపై మక్కువ పెంచుకున్నారు. రామస్వామి రచనల నుంచి గ్రూప్–1 పరీక్షల్లో ప్రశ్నలు వస్తుంటాయని కూడా ఐఏఎస్ అధికారులు ఆయన జీవితాన్ని కొనియాడుతున్నారు. కవిరాజు పేరిట కేంద్ర ప్రభుత్వం స్టాంపును కూడా విడుదల చేసింది. కవిరాజు రచించిన సూత పురాణానికి వందేళ్లు వచ్చాయి. కవిరాజు జయంతి జనవరి 15 అయితే.. వర్ధంతి జనవరి 16వ తేదీ కావటం విశేషం.



గత వైఎస్సార్ సీపీ హయాంలో కవిరాజు నివాళులర్పించిన జిల్లా కలెక్టర్ ఇంతియాజ్ (ఫైల్)

అయ్యప్ప స్వామికి పూజలు



మండవల్లి: పెరికెగూడెంలో కొలువై ఉన్న అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని స్వామి ఆలయంలో అర్చకులు మంగళవారం రాత్రి జ్యోతి వెలిగించి భక్తులకు దర్శనం భాగ్యం కల్పించారు.

రంగవల్లులతో మంచి వ్యాయామం

గుడ్లవల్లేరు: రంగవల్లులను మహిళలు వేయటం వలన మంచి వ్యాయామంతో పాటు ఆరోగ్యం చేకూరుతుందని కొతవరం పీహెచ్‌సీ డాక్టర్ బి.శ్రావ్య అన్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని శ్రీ షిరిడీ సాయి మందిర మహిళా నిర్వాహకుల ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. విజేతలను ఎంపిక చేసి ప్రోత్సాహ బహుమతులను ఆ మందిర అభివృద్ధి చైర్మన్ కానూరి బాలకృష్ణమోహన్ ఆర్థికసాయంతో అందజేశారు.

గ్రామీణ క్రీడలను కాపాడుకుందాం

మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

తోట్లవల్లూరు: గ్రామీణ క్రీడలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని పెనమకూరులో భారత యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి జరిగిన సంక్రాంతి పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. కోడి పందేలు, జూదానికి వ్యతిరేకంగా భారత యువజన సంఘం గత అనేక ఏళ్లుగా చేస్తున్న కృషి అభినందనీయమని అనిల్‌కుమార్ అన్నారు. షటిల్ జూనియర్స్, సీనియర్స్, రన్నింగ్, సైకిల్ స్లో, మ్యూజికల్ చైర్స్, రంగవల్లులు, మోకులాగుడు పోటీల విజేతలకు ఆయన బహుమతులను అందజేశారు. అలాగే స్థానిక జెడ్పీ పాఠశాల్లో గత ఏడాది పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అనిల్‌కుమార్ నగదు బహుమతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మరీదు నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు మధుబాబు, ప్రజానాట్య మండలి ప్రతినిధి కొండలబాబు, శివాలయం మాజీ చైర్మన్ వీరశ్రీను, వార్డు సభ్యుడు నాగవర్ధన్, భారత యువజన సంఘం ప్రతినిధులు యోహాను, అశోక్, శ్రీను పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

ఘనంగా సంక్రాంతి వేడుకలు



పెరిశేపల్లి ఆశ్రమంలోని వృద్ధులకు బహుమతులను అందజేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర



కైకలూరులో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

పెరిశేపల్లి(పామర్రు): మండలంలోని పెరిశేపల్లిలో కృష్ణం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధ శరణాలయంలో సంక్రాంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. ముగ్గుల పోటీలు, బొమ్మల కొలువులు నిర్వహించారు. వృద్ధులకు వాల్ క్లాక్‌లను అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ చెరుకూరి కృష్ణమూర్తి దంపతులు చేస్తున్న సేవలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. స్థానిక గొట్టిపాటి లక్ష్మీదాసు, గొట్టిపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న రంగవల్లులు

పామర్రు: సంక్రాంతి పండుగను ప్రతి గ్రామంలో ఆదివారం ఘనంగా చేసుకున్నారు. తొలుత చిన్నారులు బొమ్మల కొలువులను ఏర్పాటు చేసుకుని బొమ్మలకు పూజలు చేశారు. యువతులు రహదార్ల వెంబడి వేసిన రంగవల్లులు ఆకట్టుకున్నాయి. పలు చోట్ల ముగ్గుల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

వైభవంగా గోపూజ

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో కనుమ పండుగ సందర్భంగా బుధవారం గోపూజను వైభవంగా నిర్వహించారు. గోకులంలోని గోవులకు అర్చకులు పసుపు, కుంకుమలతో అలంకరించి స్వామివారి పుట్టవద్దకు తీసుకువచ్చి పూజలు చేశారు. కార్యక్రమానికి విశేష సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఆలయ సహాయ కమిషనర్ ఆర్. గంగాశ్రీదేవి, సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కైకలూరులో..

కైకలూరు: సంక్రాంతి సందర్భంగా ఎంపీటీసీ సభ్యుడు మంగినేని రామకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక శ్యామలాంబ అమ్మవారి దేవస్థాన ఆవరణలో మంగళవారం నిర్వహించిన రంగవల్లుల పోటీలు ఆకట్టుకున్నాయి. మొత్తం 45 మంది ఈ పోటీలో పాల్గొనగా మొదటి బహుమతి బొర్రా చైతన్య రూ.10వేల విలువైన పట్టు చీర, రెండో బహుమతి కాకళ ప్రమీళ రూ.5 వేల విలువైన పట్టుచీర, మూడో బహుమతి కటికల శిరిషారాణి రూ.3 వేల విలువైన పట్టు చీర, నాల్గో బహుమతి తోట పూర్ణిమ రూ.2వేల విలువైన పట్టు చీర అందుకున్నారు. మ్యూజికల్ చైర్స్, డ్యాన్స్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు హాజరయ్యారు. న్యాయ నిర్ణేతలుగా కమ్మిలి స్వర్ణకుమారి, కురేళ్ల బేబీ, బొమ్మనబోయిన విజయలక్ష్మి, దానం మేరీ నవరత్నకుమారి, అడవి శ్యామల, తోట లక్ష్మీ, మంగినేని బుజ్జి, కోట అన్నపూర్ణ వ్యవహరించారు. నిర్వాహకులు పవన్, శ్యామలరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



పామర్రులో ఓ ఇంటి ముంగిట వేసిన సంక్రాంతి ముగ్గు



సింగరాయపాలెంలో గోపూజ నిర్వహిస్తున్న అర్చకులు

కనుల పండువగా గోదాదేవి కల్యాణం

గుడ్లవల్లేరు: భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీనివాస గోదాదేవి కల్యాణం దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు, మెయిల్ అధినేత పురిటిపాటి వెంకటకృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతులు కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో మెయిల్ సీఈఓ పురిటిపాటి సుబ్బారెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి, ఆలయ నిర్వాహకులు కె.బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ, పురిటిపాటి సత్యనారాయణరెడ్డి, కనుమూరి రామిరెడ్డి, పామిరెడ్డి వాసురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కల్యాణంలో కృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల పూజలు

సీపీఎం నేత శిఖామణికి ఘన నివాళి

పామర్రు: సీపీఎం నాయకుడు చాట్ల శిఖామణి వర్ధంతిని స్థానిక చాట్ల వానిపురలో బుధవారం నిర్వహించారు. తొలుత చాట్ల శిఖామణి స్థూపం వద్ద ఆయన చిత్ర పటానికి సీపీఎం నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ సీపీఎం పామర్రు పట్టణ కార్యదర్శిగా 40 ఏళ్ల పాటు ఎనలేని సేవలను అందించారన్నారు. కార్యక్రమంలో నాయకులు కొడమంచిలి వెంకటేశ్వరరావు, కొక్కిలిగడ్డ లక్ష్మణ, ఒడుగు గంగాధర ప్రసాద్, బరిగెల భీమేశ్వరరావు, చాట్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



శిఖామణి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవచ్చు

గుడ్లవల్లేరు: చెప్పులు కుట్టే వారి అభ్యున్నతికి కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసుకోవచ్చని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. బుధవారం గుడ్లవల్లేరులోని ఫ్లాట్‌ఫారమ్‌పై అమ్ముకుంటున్న బుల్లా త్యాగరాజు చెప్పుల బడ్డీకి ఆయన విచ్చేసి చెప్పులు కొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన లెదర్ ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా చర్మకారులు చెప్పులు కుట్టేవారికి ఆర్థిక చేయూత నూరు శాతం సబ్సిడీతో అందుతుందని ఎమ్మెల్యే చెప్పారు.

మినుము పైరు దగ్ధం

ముదినేపల్లి రూరల్: పెదపాలపర్రులో మినుము పైరు బుధవారం దగ్ధమైంది. గ్రామానికి చెందిన కన్నెపోటు శ్రీనివాసరావు అనే రైతుకు చెందిన ఐదు ఎకరాల భూమిలో మినుము పైరు సాగు చేశాడు. పైరు ఏపుగా ఎదిగి కోత దశకు వచ్చింది. ఇలాంటి తరుణంలో బుధవారం ఒక్కసారిగా మినప చేలో పొగలు కమ్మి మంటలు చెలరేగి మూడు ఎకరాల పైరు దగ్ధమైనట్లు రైతు శ్రీనివాసరావు తెలిపారు. మంటలను ఆర్పేందుకు ఎలాంటి అవకాశం లేకపోవడంతో ఏపుగా ఎదిగిన పైరు పూర్తిగా దగ్ధమైనట్లు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారాన్ని స్థానిక వీఆర్వోకి తెలియజేయగా ఉన్నతాధికారులకు సమాచారమందిస్తామని ఆయన చెప్పారని పేర్కొన్నారు.

జగన్నాథస్వామి గ్రామోత్సవం



ముదినేపల్లి రూరల్: రెండో పూరిగా ప్రసిద్ధిచెందిన మండలంలోని వడాలి జగన్నాథస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సంక్రాంతి వేడుకల్లో భాగంగా ఆదివారం స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు అగ్నిహోత్రం శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్ల విగ్రహాలను మండపంపై ఉంచి, సుందరంగా అలంకరించారు. ఆలయ ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు, సిబ్బంది పర్యవేక్షించారు.